

# దేవతలు

నర్సిమ్మకు దిగులే దిగులు... అతని దృష్టిలో జీవితమొక వైకుంఠపాళి. సంసారమొక సాగరం. అన్న అవగాహన వెన్ను తట్టినాక క్షణ క్షణం భయంకర నరకమే.

ఎదగటానికి సిద్ధంగా కూచున్న సీతిగుంట...ఖళ్ళు ఖళ్ళుమని దగ్గే ముసలి తల్లి మునెమ్మ...నిర్విరామంగా బరువు బాధ్యతలు గుర్తు చేస్తూ చెళ్ళున కొరడాతో చరుస్తున్నారు.

ఈ రోజు ఎలా నెట్టుకు రావాలో తెలీని అయోమయంలో వున్నాడు నర్సిమ్మ.

దేవుడు తనకు చాలా అన్యాయం చేసాడనిపిస్తుంది. అందరిలా ఏ కూలికి నాలికీ వెళ్ళే అలవాటుకు యిచ్చగించక బొమ్మలు వేయటమనే కళని తండ్రి వారసత్వంగా సరఫరా... దాన్ని పట్టుకునే వేళ్ళాడాడు నర్సిమ్మ.

తండ్రి మరణంతో దిక్కులేని తనకు నడిరోడ్డే గతయ్యింది.

రంగురంగుల సుద్ద ముక్కలు... హస్త నైపుణ్యంతో నున్నటి తార్రోడ్డు మీద అనేక చిత్రాలై భాసిల్లాయి. వలయాకారమై జనం మూగేవారు. 'ఓహో! అంటే ఓహో!!! అనటం... దయ గలిగిన వాళ్ళు దక్షిణ వేసేవారు. దేవుడి బొమ్మలు కాబట్టి దణ్ణమెట్టి మరీ...

ఒకసారి రంజనీహాలు దగ్గర..మరోసారి మూడు లాంతర్లు... ఇంకోసారి మయూరీ జంక్షన్...

కష్టం తీరే ఆదాయం కుటుంబానికి సరిపోయేది. సరిగ్గా అప్పుడే నర్సిమ్మ ఆదాయానికి గొడ్డలి పెట్టయ్యింది. ఒకరోజు నర్సిమ్మ న్యూపూర్ణా హాలు దగ్గర వీరాంజనేయుడి బొమ్మ వేసాడు.

ఠంగ్ ఠంగ్ మంటూ ఒకటే నాణాలు. చిందర వందరగా పడ్డ నాణాలు ఏరుకుంటుంటే నేల మీద లాఠీ తాటిస్తూ ఎర్రటోపీ నిలబడింది.

"కలక్షన్స్ బాగా వున్నట్టుందే... మాకంటే నీ బిజినెస్సే బాగున్నట్టుంది. మదుపులేని వ్యాపారం... మరినాకు రావల్సిన వాటా..." అని వ్యంగ్యంగా చూసాడు.

విషం వెళ్ళగ్రక్కిన నవ్వు.

ఇంతవరకు నర్సిమ్మ నమ్మింది తన కళను...వ్యాపారం లాంటి భావనకు రాలేదు. కడుపు నింపడానికే కాసిని మెతుకులు పెట్టే దైవం.....!

అవే భావాలు వ్యక్తం చేసాడు. ఎర్రటోపీ ఎర్రగా చూసింది. నర్సిమ్మ ప్రమేయం లేకుండా సగం నొర్లుకుంది. బ్రతిమాలినా ఫలం దక్కలేదు.

సరిగ్గా ఆ రోజు మొదలుగా రాత్రి ఎనిమిదియ్యేటప్పటికీ ఠంచనుగా వాలేవాడు జమాను. కర్కోటకుడిలా నెత్తిన కూచునేవాడు.

ఒక్కోసారి సీతి గుంటచేత ఎవరూ లేనప్పుడు డబ్బులు ఇంటికి నడిపేవాడు నర్సిమ్మ. కాని ఒకరోజు మాత్రం జమాను చేతికి సీతి దొరికిపోయింది. దాన్ని ఈడ్చుకెళ్ళాడు. ఆరోజు ఆదాయం పోయినా గుండెలల్లాడలేదు గాని సీతిని ఒళ్ళంతా తడిమాడని తెలిసినప్పుడు జమానుమీద ఎడతెగని అక్కసు చెలరేగింది.

కాని పోలీసులతో తగవు తమ బోటి వాళ్ళకే ముప్పని తెలిసి లోలోపలే దిగమింగేసాడు.

అలా అలా గద్దలెత్తుకుపోతున్న ఆదాయం... ఎదిగిన పాపానికి కుర్రాళ్ళకెపు కళ్ళకి బలైపోయిన సీతి... ఆసుపత్రి రంగునీళ్ళకి తగ్గని మునెమ్మ దగ్గు... వీటన్నింటి మధ్య నర్సిమ్మ తిరగలి దిమ్మలో బియ్యం గింజలా నలిగిపోయాడు.

రోజులు మారుతున్నాయి. రోడ్డుమీద రద్దీ మునుపటి కంటే హెచ్చింది. రకరకాల షాపులు వెలిసాయి. జనం ఎవరిగొడవలో వారుంటున్నారు.

దేవుడి బొమ్మలు చూడ్డం, దణ్ణం పెట్టడం, దక్షిణ వేయటం వంటి

ఆనవాయితీలకి తిలోదకాలిచ్చేసారు. కాస్తో కూస్తో డబ్బు లొచ్చినా సుద్ద ముక్కల మదుపుకే సరిపోతోంది. జమాను బాధ ఎలానూ వుంటోంది. ఏమైనా ఎదురు మాట్లాడితే ట్రాఫిక్‌కి అడ్డుగా వుందని ఆటంకం ఏర్పరచి తగిలేస్తున్నాడు.

నర్సిమ్మ ఆరోజు కూడా యథాప్రకారం బాలాజీ హాలుదగ్గర సరిగ్గా రింగు రోడ్డుదగ్గర వెంకటేశ్వరుడి బొమ్మ పెద్దగా వేసాడు.

నాలుగు డబ్బులు పోగవటం ఖాయమనుకున్నాడు. ప్రొద్దు వాటారే దాకా వున్నాసరే ఆ రోజుకి పొయ్యిలో పిల్లిని లేపలేని పరిస్థితి ఎదురు కాబోతోందని గ్రహించాడు.

నిరాశగా కదిలాడు నర్సిమ్మ. రంజని హాలు దగ్గర చాలా మంది జనం మూగివున్నారు.

ఏమిటైందంటే ఏమిటైందని ఒకరొకరే ఎగబడుతున్నారు. ఎవరి మధ్యనైనా ఘర్షణగాని, లేదా ఎవరికైనా యాక్సిడెంట్‌గాని జరిగిందేమోనని నర్సిమ్మ కూడా దూరాడు గుంపులోకి.

నర్సిమ్మ కూడా ఆ దృశ్యాన్ని తిలకించాడు.

"సూపర్ కదూ!"

"బ్యాన్ చేయలేదేంటి చెప్మా!!"

"మరీ బరి తెగించారు ఛూ.... నీయవ్వ..."

"ఆ ఫోజులో... వారెవ్వా యమ ఇదిగా వుంది గురో!"

తలొకరూ తలో విధంగా అనుకుంటూ వెళ్తున్నారు.

అక్కడి వాతావరణం చూసాక నర్సిమ్మలో పరవళ్లు తొక్కిన ఆనందం... పారవశ్యం...

మరునాడు తన మనసులో ఊపిరి పోసుకున్న కోరికను తీర్చుకున్నాడు. బాలాజీ సెంటర్‌లో... నర్సిమ్మ చేతిలో సుద్ద ముక్కలు అనేక విన్యాసాలకు ఆలవాలమై ఎన్నో రూపాలను రూపుదిద్దసాగాయి.

నర్సిమ్మ బొమ్మలు చూడ్డానికిప్పుడు జనం వెంపర్లాడుతున్నారు... వెర్రెక్కిపోతున్నారు.

అతనిలో కళాకారుడు ఇప్పుడు అందరి కళ్ళల్లో ప్రతిబింబిస్తున్నాడు. జనం నీరాజనాలర్పిస్తున్నారు.

ఇంతకాలం నర్సిమ్మ దేవుళ్ల బొమ్మలు వేసినా అతన్ని ఏ ఒక్క దేవుడు కనికరించలేదు... కాని అతన్ని ఈ రోజు కాపాడ్డానికి ఎందరో దేవతలు నేలదిగి వచ్చారు. వారి పుణ్యమాని బ్రతుకు సాఫీన పడింది.

గాడి తప్పిన బండికాలేదు. ఇప్పుడతనికి సీతి బెంగపోయింది. మునెమ్మ దగ్గకి కళ్లెం వేసాడు. ఏ ఎర్రటోపీ వచ్చినా ఎంతో కొంత వేయగల ధీమా వచ్చింది.

ఒకరోజు - యథాప్రకారం నర్మిమ్మ జనానికి ఆరాధ్యనీయమైన చిత్రాలను రోడ్డుమీద తీర్చిదిద్దుతున్నాడు.

ఆరోజు నేలమీద వాలిన (శృంగార) దేవత మమతా కులకర్ణి అందంగా ఎక్స్‌పోజింగ్‌గా...

జనం మూగారు.

చిల్లర రాలటం మొదలైంది...

(తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) రాజాలక్ష్మి ఫౌండేషన్స్ (మద్రాసు)
ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక కథల పోటీలో
కన్సొలేషన్ బహుమతి పొందిన కథ 7-11-1997)